


# ప్రజా రిపబ్లిక్

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
EVENING 6 PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 206 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 +https:www.prajarepublic.com + వెల - 1/- ఆదివారం 02 మార్చి 2025

RNI No: APTEL/2023/87888 Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole


# తెలంగాణకు భారాస, భాజపా ఏం చేశాయి?: సీఎం రేవంత్ రెడ్డి

వనపర్తి తనకు చదువుతో పాటు సంస్కారం నేర్పించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. వనపర్తి విద్యార్థిగా తెలంగాణకు వన్నెతెచ్చాడనే కీర్తి తీసుకొస్తానని హామీ ఇచ్చారు.

**వనపర్తి, మార్చి 2, (రిపబ్లిక్ న్యూస్):** వనపర్తి తనకు చదువుతో పాటు సంస్కారం నేర్పించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. వనపర్తి విద్యార్థిగా తెలంగాణకు వన్నెతెచ్చాడనే కీర్తి తీసుకొస్తానని హామీ ఇచ్చారు. స్థానిక పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన 'ప్రజాపాలన-ప్రగతి బాట' బహిరంగ సభలో సీఎం ప్రసంగించారు. "గతంలో వనపర్తి రాజకీయాల్లో కక్షలు, ధన ప్రభావం ఉండేది కాదు.



ఐదేళ్ల క్రితం ఇక్కడి నుంచి ఎన్నికైన ఎమ్మెల్యే రాజకీయాలను కలుషితం చేశారు. కేసీఆర్ పదేళ్లు తెలంగాణకు ముఖ్యమంత్రిగా ఉన్నారు. మోదీ 12 ఏళ్లుగా ప్రదానిగా ఉన్నారు. తెలంగాణకు భాజపా, భారాస ఏం చేశాయి? ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతులకు రూ.21వేల కోట్ల రుణమాఫీ జరిగిందా? లేదా? చెప్పాలని రైతులకు విజ్ఞప్తి చేస్తున్నా. భారాస, భాజపా నాయకుల తప్పుడు ప్రచారాన్ని రైతులు తిప్పికొట్టాలి. విద్యుత్ డిమాండ్ పెరుగుతున్నా ఎక్కడైనా కోతలు విధించామా? రూ.200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామా? లేదా? మహలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తున్నాం. 65 లక్షల మంది మహిళలు స్వయంసహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్నారు. సభ్యుల సంఖ్య కోటికి చేర్చాలని ప్రయత్నిస్తున్నాం. కోటి మంది ఆడ బిడ్డలను కోటీశ్వరులను చేయాలని కృషి చేస-్తున్నాం. ఆడబిడ్డలు ఆశీర్వదిస్తే రేవంత్రెడ్డి మరో 15.. 20ఏళ్లు సీఎంగా కాంగ్రెస్ అధికారంలో ఉ ంటే .. తమ బతుకు బస్టాండ్ అవుతుందని భాజపా, భారాస నేతలు భయపడుతున్నారు. పదేళ్లుగా పాలమూరు ప్రాజెక్టులను ఎందుకు పండ బెట్టారని భారాస నేతలను అడుగుతున్నా. కృష్ణా జలాలను ఏపీ సర్కారు రాయలసీమకు కొల్లగొట్టుకు పోతుందంటే అందుకు కారణం కేసీఆర్. 811 టీఎంసీల్లో 511 టీఎంసీలు ఆంధ్రాకు తీసుకెళ్లండని కేసీఆర్ సంతకం పెట్టారు. ఆ సంతకమే ఇవాళ తెలంగాణ రైతాంగానికి శాపంగా మారింది. ఎస్ఎల్బీసీ పాపాల భైరవుడు కేసీఆర్ కాదా? పదేళ్లు భారాస పాలనలో ఎస్ఎల్బీసీ పనులు ఆగిపోవడం వల్లే కుప్పకూలింది. టన్నెల్లో 8మంది ప్రాణాలు పోవడానికి కారణం కేసీఆర్. కేసీఆర్ను నమ్మినందుకే పాలమూరు పడావు పడింది. అప్పుడే నన్ను దిగు..దిగు అని కేటీఆర్, హరీశ్రవు, కవిత అంటున్నారు. పాలమూరు రైతు బిడ్డ సీఎం అయితే చూసి ఓర్వలేరా? కేసీఆర్.. మీరు ఏలడానికి పుడితే.. మేం బిచ్చమెత్తుకునేందుకు పుట్టామా? మామునూరు ఎయిర్ పోర్టు ప్రధాని మోదీ ఇచ్చారు.. నేనే తెచ్చానని కేంద్ర మంత్రి కిషన్రెడ్డి చెబుతున్నారు. అదే నిజమైతే.. మెట్రో రాలేదు, ఆపింది మోదీనే కదా? మూసీ ప్రక్షాళనకు నిధులు రాలేదు.. ఆపింది మోదీనే కదా?. రీజినల్రింగ్ రోడ్డు ఉత్తరభాగం నేనే తెచ్చానని కిషన్రెడ్డి చెబుతున్నారు. దక్షిణ భాగం ఆగిపోయింది. ఆపింది మీరే కదా? పాలమూరు రంగారెడ్డికి 60 టీఎంసీల నీటి కేటాయింపులు పదేళ్ల నుంచి పెండింగ్లో ఉన్నాయి. ఆపింది మీరు కాదా? వస్తేనేమో ఆయన ఖాతాలో రాసుకుంటారు.. రాకపోతేనే రేవంత్రెడ్డి ఏం చేయ-లేదంటారు. సికింద్రాబాద్ వరద బాధితులకు కిషన్రెడ్డి ఏం చేశారు. నా కంటే చిన్నోడు రాష్ట్రానికి సీఎం అయ్యిండని కిషన్రెడ్డికి కడుపుమంట. కిష-న్రెడ్డీ.. మీ దగ్గర మోదీ, ఈడీ, సీబీఐ ఉండొచ్చు. ఎంతకాలం ఈడీ, సీబీఐని చూపించి బెదిరిస్తారు? మేం ఎవరికీ భయపడం. మోదీ మనకు ఏదో ఒకటి చేయాలనే ఆలోచనలోనే ఉన్నారు. మోదీ చేయాలనుకున్నా.. కిషన్రెడ్డి సైంధవుడిలా అడ్డు పడుతున్నారు. తన రహస్య మిత్రుడు దిగిపోయాడని కిషన్రెడ్డి బాధపడుతున్నారు." అని సీఎం ప్రశ్నించారు.

## రెండున్నరేళ్లలో మామునూరు ఎయిర్ పోర్టు పూర్తి చేస్తాం: రామ్మోహన్ నాయుడు



**హైదరాబాద్, మార్చి 2, (రిపబ్లిక్ న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం భూమి కేటాయించకపోవడం వల్లే మామునూరు విమానాశ్రయం ఏర్పాటు ఆలస్యమైందని కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. కేంద్రం ఒత్తిడి వల్ల భూ కేటాయింపులు జరగడంతో ఎనిమిది నెలల్లోనే క్లియరెన్స్ ఇచ్చామని రామ్మోహన్ నాయుడు వివరించారు. హైదరాబాద్ కవాడీగూడలో కేంద్రమంత్రి కిషన్రెడ్డితో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. "మామునూరు ఎయిర్పోర్ట్ క్లియరెన్స్ ఇక్కడి ప్రజల చిరకాల వాంఛ. ఈ విమానాశ్రయం గతంలో ఆసియాలోనే అతిపెద్ద ఎయిర్పోర్టుగా ఉండేది. 1981 వరకు ఇక్కడి నుంచి రాకపోకలు కొనసాగేవి. క్రమేపీ హైదరాబాద్ అభివృద్ధి చెందడంతో ఎయిర్ పోర్ట్ హైదారాబాద్కు షిఫ్ట్ అయ్యింది. అయినప్పటికీ అక్కడి ప్రజలు అనేక పోరాటాలు చేశారు. నరేంద్ర మోదీ ప్రధాని అయ్యాక విమానయాన రంగంలో ఓ విప్లవం మొదలైంది. పదేళ్లలో దేశంలోని ఎయిర్పోర్టుల సంఖ్య 79 నుంచి 150కి పెరిగింది. చిన్న చిన్న నగరాల్లోనూ ఎయిర్పోర్టులు ఏర్పాటు చేశాం. వరంగల్ వంటి నగరంలో ఎయిర్పోర్టు విషయంలో అడుగులు ముందుకుపడలేదు. తెలుగు ప్రజల మంత్రిగా పని చేయాలని చంద్రబాబు మార్గనిర్దేశం చేశారు. ఏపీ కోసం ఎలా పని చేస్తావో.. అదే చిత్తశుద్ధితో తెలంగాణ కోసం కూడా పనిచేయాలని సూచించారు. తెలంగాణలోనూ ఎయిర్పోర్టులు ఏర్పాటు చేయాలని కిషన్రెడ్డి సూచించారు. మామునూరు ఎయిర్పోర్టు క్లియరెన్స్ విషయంలో కొన్ని సమస్యలు వచ్చాయి. ఎయిర్పోర్టుకు 2800 మీటర్ల రన్వే అవసరం. 280 ఎకరాలు అదనంగా భూసేకరణ అవసరమని కేంద్రం నుంచి ప్రతిపాదనలు వచ్చాయి. గత ప్రభుత్వం నుంచి సరైన సహకారం లేనందువల్లే ఆలస్యమైంది. రాష్ట్ర ప్రభుత్వం త్వరగా భూసేకరణ చేస్తే ఎయిర్పోర్టు పనులు వేగవంతం అవుతాయి. భూసేకరణ పూర్తయిన రెండున్నరేళ్లలో నిర్మాణం పూర్తి చేస్తాం. శంషాబాద్ ఎయిర్పోర్టు నుంచి ఎన్వోసీ తీసుకొని క్లియరెన్స్ ఇచ్చాం. భద్రాద్రి ఎయిర్పోర్టు విషయంలో గతంలో ఒక స్థలాన్ని ప్రతిపాదించారు. గతంలో సూచించిన స్థలం ఫీజిబులిటీగా లేదు... మరో స్థలం ప్రతిపాదించారు. భద్రాద్రి విషయంలో కొత్త స్థలంపై ఫీజిబులిటీని పరిశీలించి నిర్ణయం తీసుకుంటాం" అని రామ్మోహన్ నాయుడు తెలిపారు.

## రూ.5కే రైతులకు శాశ్వత విద్యుత్ కనెక్షన్ :మధ్యప్రదేశ్ సీఎం ప్రకటన

మధ్యప్రదేశ్లోని రైతులకు కేవలం రూ.5కే శాశ్వత విద్యుత్ కనెక్షన్ మంజూరు చేస్తామని సీఎం మోహన్ యాదవ్ ప్రకటించారు.



**భోపాల్, మార్చి 2, (రిపబ్లిక్ న్యూస్):** రైతులకు కేవలం రూ.5కే శాశ్వత విద్యుత్ కనెక్షన్ మంజూరు చేస్తామని మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ ప్రకటించారు. భోపాల్లో నిర్వహించిన ఓ ర్యాలీలో ఆయన మాట్లాడారు. మధ్యప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఈ పథకాన్ని త్వరలోనే ప్రారంభిస్తుందన్నారు. శాశ్వత విద్యుత్ కనెక్షన్ లేని రైతాంగానికి ఈ సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. రైతులకు మంచి చేయాలని, వారి జీవితాలు మెరుగుపడాలని తాము కోరుకుంటున్నామన్నారు. నీటిపారుదల కోసం సోలార్ పైపుల ద్వారా రైతులకు విద్యుత్ సంబంధిత ఇబ్బందుల్ని తమ ప్రభుత్వం తొలగిస్తుందన్నారు. రాబోయే మూడేళ్లలో 30లక్షల సోలార్ ఇరిగేషన్ పంపుల్ని రైతులకు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు సీఎం చెప్పారు. రైతుల నుంచి ప్రభుత్వం సోలార్ విద్యుత్ను కొనుగోలు చేస్తుందన్నారు. కాంగ్రెస్ పాలనలో గ్రామాల్లో సరైన మౌలికవసతులు, విద్యుత్తు, రోడ్లు లేవన్న ఆయన.. భాజపా అధికారంలోకి వచ్చాక ఆ పరిస్థితులు మెరుగుపడ్డాయని చెప్పుకొచ్చారు.

## ఏపీ మహిళా సాధికారిత అంబాసిడర్ మీనాక్షి చౌదరి.. ప్రచారంలో నిజమెంత?

ఏపీ ఉమెన్ ఎంపవర్మెంట్ బ్రాండ్ అంబాసిడర్గా హీరోయిన్ మీనాక్షి చౌదరి నియమితులైనట్లు వస్తోన్న వార్తలపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది.

**అమరావతి, మార్చి 2, (రిపబ్లిక్ న్యూస్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా సాధికారిత బ్రాండ్ అంబాసిడర్గా హీరోయిన్ మీనాక్షి చౌదరి నియమితులైనట్లు పెద్ద ఎత్తున జరుగుతున్న ప్రచారంపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. ఆమె నియామకం పట్ల సామాజిక మాధ్యమాల్లో వస్తోన్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేసింది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వ ఫ్యాక్ట్చెక్ విభాగం 'ఎక్స్'లో పోస్టు పెట్టింది. ప్రభుత్వం పేరుతో ఉ ద్దేశపూర్వకంగా ఇటువంటి తప్పుడు పోస్టులు పెడుతున్న వారిపై, ఫేక్ ప్రచారం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా హెచ్చరించింది. గతేడాది గుంటూరు కారం, లక్కీ భాస్కర్ చిత్రాలతో మంచి హిట్లు అందుకున్న మీనాక్షి చౌదరి.. ఈ ఏడాది విడుదలైన 'సంక్రాంతికి వస్తున్నాం'లో వెంకటేశ్ ప్రియురాలిగా ప్రేక్షకులకు వినోదం పంచిన విషయం తెలిసిందే.



# రూ.15 కోట్లు గంగ పాలు

## నగర సుందరీకరణ పేరుతో భారీ ఖర్చు



కర్నూలు నగరాన్ని సుందరంగా తీర్చి దిద్దడం కోసం నగర పాలక సంస్థ అధికారులు వివిధ రకాల బొమ్మలు ఏర్పాటు చేసేందుకు భారీగా నిధులు ఖర్చు చేశారు. కొన్ని ప్రాతాలలో వారికి నచ్చిన పులి, జింక, పక్షులు, రైతు,జీరాఫీ, వంటి వివిధ రకాల బొమ్మలు ఏర్పాటు చేశారు. అయినా నగరంలో సుందరీకరణ అటకెక్కింది. నిర్వహణ లోపం కారణంగా దాదాపుగా రూ. 15 కోట్లకు పైగా నిధులు గంగ పాలయ్యాయని విమర్శలు వెలువెత్తుతున్నాయి. అడుగడున నిర్వహణ లోపం ఉందని అందుకే సక్రమంగా పనులు చేయలేక పోయారని ప్రజలు అంటున్నారు. నగరం అందంగా కనిపించడం కోసం పలు ప్రాంతాల్లో అధికారులు నగరంలో ఏర్పాటు చేసిన వివిధ రకాల బొమ్మలు అప్పుడే విరిగిపోయి కళా విహీనంగా మారి పోతున్న అధికారులు నిమ్మకు నీరెత్తిన చందంగా మిన్నకుండి పోయారు. అయితే నగరంలో సుందరికరణ పనులు నాసిరికంగా ఉ ండడంతో చేసిన పనులు అప్పుడే పాడైపోయాయి. గత వైసిపి ప్రభుత్వ హయాంలో కోట్లు ఖర్చు చేసి నగరంలో గోడలపై బొమ్మలు వేయించారు. ప్రస్తుతం అవి మాయం అయ్యాయి. మరో అడుగు ముందుకు వేసి నగరం లోని ప్రధాన సెంటర్లలో అందంగా కనిపించేందుకు ప్రత్యేకమైన బొమ్మలు తయారు చేయించి పెట్టారు. ఈ బొమ్మలు క్వాలిటీ లేకపోవడంతో పగుళ్లు వచ్చి విరిగిపోతున్నాయి. ఆ ప్రాంతాలు దీంతో మరింత దరిద్రంగా కనిపిస్తున్నాయి. క్యాలిటి చూడకుండా తగిన ప్రాధాన్యత ఇవ్వనందుకు అంతే కాకుండా డబ్బులు సరిగ్గా ఖర్చు చేయకపోవడం వల్ల ఈ దుస్థితి పట్టిందని విమర్శలున్నాయి. బొమ్మలు విరిగి పగిలిపోతున్న ఏమాత్రం అధికారులు నగర పాలక సంస్థ పాలక వర్గం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నా ఎవరికీ కూడ చీమ కుట్టినట్లైనా లేదని ప్రజలు అంటున్నారు. నగరాన్ని అందంగా తీర్చి దిద్దడం కోసం ఎన్ని తిప్పలు పడుతున్న ఫలితం ఏ మాత్రం కనిపించడం లేదు. నగరం లో దాదాపు 6 లక్షల జనాభా ఉంది. జనాభా కు తగ్గ పార్కులు కూడా లేవు.

## అడుగడుగునా నిర్వహణ లోపం

## నగరపాలక సంస్థ అధికారుల మాయాజాలం

### నగరంలో సుందరీకరణ మాయం

నగరాన్ని సుందరంగా తీర్చి దిద్దడం కోసం చేసిన ప్రయత్నాలు ఏ మాత్రం ఫలితం కనిపించడం లేదు. పైగా సుందరీకరణ మాయం అయిపోయిందని ప్రజలు విమర్శిస్తున్నారు. నగరంలో కోట్లు ఖర్చు చేసి చేసిన పనులు అప్పుడే మాయమైపోతున్నాయి. నగరంలోని 52 వార్డులు ఉండగా 10 కోట్లకు పైగా ఖర్చు చేశారు. వివిధ ప్రాంతాల్లో సుందరి కరణ పేరుతో భారీగా విచ్చలవిడిగా డబ్బు ఖర్చు చేశారు. గోడలపై బొమ్మలు వేయడం బొమ్మలను నగరంలో ఏర్పాటు చేయడం కార్యక్రమాల కోసం చేసిన ఖర్చు వృధా అయింది. ఎవరికి ఉపయోగపడని ఈ బొమ్మల ఏర్పాటు కోసం కోట్లు ఖర్చు చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ 10 సంవత్సరాల కాలంలో దాదాపు 15 కోట్లకు పైగానే సుందరీకరణ పేరుతో ఖర్చు చేశారు. నగరంలో ఎక్కడ చూసిన నగరం అంతా అద్వానంగా మారింది




### అక్షరమాల పేరుతో స్వాహ

నగరంలో తెలుగు అక్షర మాల ఏర్పాటు చేయాలన్న తలంపుతో 5 రోడ్ల కూడలి , నగర పాలక ఎదురుగ గాయత్రి ఎస్టేట్ ఈ క్యాంపు, నగరపాలకసంస్థ సమీపంలోవద్దా అక్షరమాల ఏర్పాటు చేసేందుకు అధికారాలు భారీగానే నిధులు ఖర్చు చేసినట్లు తెలుస్తుంది. ఇదే ప్రాంతాల్లో ఐలాండ్ లు ఏర్పాటు చేశారు. ఇవి కూడా నాసి రకంగా ఉన్న కారణంగా అప్పటికే పగిలిపోయాయి. కేవలం అక్షరమాల ఏర్పాటు చేసేందుకు 18 లక్షల పైగా అధికారులు ఖర్చు చేశారు. తర్వాత కొద్ది రోజులకే తెలుగు అక్షరమాల మాయమైనది. ఈ నిధులన్నీ బూడిదలో పోసిన పన్నీరుగా మారాయి. రాజ విహారు సెంటర్లో కొన్ని బొమ్మలు మోక్షగుండం విశ్వేశ్వరయ్య సర్కిల్లో ఏర్పాటుచేసిన కార్మికుడు బొమ్మతో పాటు పెద్ద క్లాక్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆ క్లాక్ పనిచేయడం లేదు. నిత్యం వందలాది వాహనాలు మంది తిరిగే ఇప్పుడు లేన విశ్వేశ్వరయ్య సర్కిల్ లో ప్రజలు అక్కడ నుండి వెళతారు. ఈ క్లాకును మరమతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు. అయినా అధికారులు మరమత్తు చేయడం లేదు.

### రాష్ట్రంలో ఎక్కడికి వెళ్ళాలన్న కర్నూలు మీదుగా వెళ్ళాలి

రాష్టం లోని ఏ జిల్లాకు వెళ్ళాలన్నా కర్నూలు మీదుగా నే వెళ్ళాలి. నిత్యం వందలాది మంది ప్రయానీకులు కర్నూలు మీదుగా వెళుతుంటారు. కర్నూలు దుస్థితి ని వాళ్లంతా చూస్తూనే ఉంటారు. ఒకప్పటి మొట్టమొదటి మాజీ రాజధాని కర్నూలు ఈ విషయం ఢిల్లీ గల్లీ వరకు తెలుసు. అలాంటిది నగరంలో విరిగిన బొమ్మలు ఇతర ప్రాంతాల వారికి దర్శనం ఇస్తూ ఉంటాయి. కర్నూలు సొగసు చూడ తరమా అనుకుని నవ్వుకుని తమ తమ ప్రాంతాలకు వెళుతూ ఉంటారు. అధికారులు ఇప్పటికైనా కళ్ళు తెరిచి విరిగిన బొమ్మలు బాగు చేయించాలని కోరుతున్నారు.





పి.నజీర్ అహమ్మద్ కర్నూలు బ్యూరో

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పెషల్



## చరిత్రలో నేటి ప్రత్యేకత

- **1807:** అమెరికా కాంగ్రెస్ బానిసలను దిగుమతి చేసుకోవడాన్ని చట్టపరంగా నిషేధించింది.
- **1935:** ఆంధ్రప్రదేశ్ శాసనసభా స్పీకర్ గా పనిచేసిన దుద్దిల్ల శ్రీపాద రావు జననం.
- **1836:** టెక్సాస్ విప్లవం ద్వారా టెక్సాస్ రిపబ్లిక్ కు మెక్సికో దేశం నుండి స్వతంత్రం లభించింది.
- **1956:** మొరాకో దేశానికి ఫ్రాన్స్ నుండి స్వాతంత్ర్యం లభించింది.
- **1949:** స్వాతంత్ర సమరయోధురాలు, కవయిత్రి సరోజినీ నాయుడు మరణం. (జ. 1879). (చిత్రంలో)
- **1962:** తెలుగు కవి, కవిసంగమం వ్యవస్థాపకుడు యాకూబ్ జననం.
- **1977:** ఆంగ్ల భాషలో గాయకుడు, గేయ రచయిత క్రిస్ మార్టిన్ జననం.


దుద్దిల్ల శ్రీపాద రావు


టెక్సాస్


మొరాకో



సరోజినీ నాయుడు


యాకూబ్


క్రిస్ మార్టిన్

రిపబ్లిక్ స్పోర్ట్స్ SPORTS

## సచిన్ వారసత్వం.. ఛేజింగ్లో విరాట్ కోహ్లినే 'కింగ్'!

విరాట్ కోహ్లి క్రీజ్లో ఉన్నాడంటే ఎంత లక్ష్యమైనా భారత అభిమానులు టెన్షన్ లేకుండా ఉంటారు. గతంలో సచిన్ పై ఇలానే నమ్మకం ఉంచారు. ఇప్పుడు అతడి వారసత్వం కోహ్లి ముందుకు తీసుకెళ్తున్నాడు.



భారత స్టార్ క్రికెట్ విరాట్ కోహ్లి మరో అరుదైన ఘనతకు చేరువగా వచ్చాడు. అంతర్జాతీయ వన్డే కెరీర్లో 300వ మ్యాచ్ ఆడేందుకు సిద్ధమవుతున్నాడు. ఇప్పటి వరకు టీమ్ ఇండియా తరఫున కేవలం ఆరుగురు మాత్రమే ఈ ఫీట్ను సాధించారు. ఛాంపియన్స్ ట్రోఫీలో న్యూజిలాండ్ మ్యాచ్లో కోహ్లి ఏడో బ్యాటర్ అవుతాడు. ఇక అత్యధిక పరుగులపరంగా.. అంతర్జాతీయ స్థాయిలోనే మూడో ఆటగాడు కావడం గమనార్హం. కోహ్లి కంటే సచిన్ (18,426), కుమార సంగక్కర (14,234) ముందున్నారు. ఈ మ్యాచ్లో మరో 150 పరుగులు చేస్తే రెండో స్థానానికి విరాట్ చేరుకుంటాడు. అత్యధిక వన్డే సెంచరీల్లో అతడే టాప్. ఇప్పుడు కింగ్ ఖాతాలో 51 శతకాలు ఉన్నాయి. 2008లో అంతర్జాతీయ క్రికెట్లోకి అడుగు పెట్టిన విరాట్ మరో 21 పరుగులు చేస్తే 8వేల పరుగుల క్లబ్లోకి చేరతాడు. అదేంటి అతడి వన్డే పరుగులు 14వేలు దాటిపోతే ఇప్పుడు 8వేలు అంటారేమిటి? అనే డౌట్ రావడం సహజమే. అయితే, లక్ష్య ఛేదనకు దిగిన సమయంలో ఈ 8వేలుం పరుగులు కావడం విశేషం. ప్రస్తుతం విరాట్ 158 ఇన్నింగ్స్ ల్లో 7,979 పరుగులతో రెండో స్థానంలో ఉన్నాడు. ఇందులో 28 సెంచరీలూ ఉన్నాయి. అతడి కంటే ముందు సచిన్ తెందూల్కర్ (232 ఇన్నింగ్స్ ల్లో 8,720 పరుగులు) టాప్లో ఉన్నాడు. విరాట్ తర్వాత రోహిత్ శర్మ (150 ఇన్నింగ్స్ ల్లో 6,087 పరుగులు) కొనసాగుతున్నాడు. న్యూజిలాండ్ పై మంచి రికార్డు ఉన్న కోహ్లి నుంచి 300వ వన్డేలో మరో సెంచరీ రావాలని మాజీ క్రికెటర్లు ఆకాంక్షించారు.

### సచిన్ కంటే విరాట్ బెటర్: మంజ్రేకర్

"సచిన్ తెందూల్కర్, విరాట్ కోహ్లికి మధ్య భారీ వ్యత్యాసం ఒకే ఒక్కటి. అదే లక్ష్య ఛేదనలో విరాట్ బ్యాటింగ్ తీరు. సచిన్ కంటే కోహ్లి అత్యుత్తమం అని చెప్పడంలో సందేహం లేదు. తొలుత బ్యాటింగ్ చేసినప్పుడు సచిన్ను ఆపడం చాలా కష్టం. కానీ, ఛేజింగ్లో కోహ్లి కుదురుకుంటే మాత్రం జట్టు విజయతీరాలకు చేరినట్లే. దాదాపు చివరి వరకూ క్రీజ్లో ఉండి గెలిపించిన సందర్భాలు చాలా ఉన్నాయి. సచిన్ చాలా విషయాల్లో ఎవరికీ అందనంత ఎత్తులో ఉన్నాడు. కానీ, ఛేజింగ్లో మాత్రం కోహ్లినే బెస్ట్" అని భారత మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ వ్యాఖ్యానించాడు.

### అతడి ఫిట్నెస్ అత్యుత్తమం: రాజ్పుత్

"సచిన్ నెలకొల్పిన చాలా రికార్డులను విరాట్ అధిగమించాడు. భవిష్యత్తులో కూడా మరిన్ని బద్దలు కొడతాడని అంచనా వేస్తున్నా. ఇప్పటికీ కోహ్లిలో పరుగుల దాహం అలానే ఉంది. 36 ఏళ్ల వయసులోనూ చాలా ఫిట్గా ఉన్నాడు. 300వ మ్యాచ్లోనూ ప్రత్యేకత చూపిస్తాడని భావిస్తున్నా. అయాచితంగా వికెట్ ఇచ్చేయాలని అస్సలు భావించడు. అతడి విలువేంటో ప్రతి ఒక్కరికీ తెలుసు. మైలురాయివంటి మ్యాచ్లో భారీ ఇన్నింగ్స్ ఆడతాడని ఆశిస్తున్నా" అని భారత మాజీ కోచ్ లాల్చంద్ రాజ్పుత్ వెల్లడించాడు.

## సినిమాలు తీయడం కంటే ఐఏఎస్ కావడం ఈజీ.. మాజీ అధికారి వ్యాఖ్యలపై సందీప్ వంగా

'యానిమల్' చిత్రాన్ని ఉద్దేశించి ఓ మాజీ ఐఏఎస్ అధికారి చేసిన వ్యాఖ్యలపై దర్శకుడు సందీప్ రెడ్డి వంగా స్పందించారు. ఫిల్మ్ మేకింగ్ తో పోలిస్తే ఐఏఎస్ కావడం సులభం అన్నట్లు వ్యాఖ్యానించారు.



'యానిమల్' చిత్రాన్ని ఉద్దేశించి గతంలో ఓ మాజీ ఐఏఎస్ అధికారి చేసిన వ్యాఖ్యలపై దర్శకుడు సందీప్ రెడ్డి వంగా స్పందించారు. ఆ అధికారిపై విమర్శలు చేశారు. కష్టపడి పుస్తకాలు చదివితే ఐఏఎస్ కావొచ్చని.. కానీ, ఫిల్మ్ మేకర్ కావాలంటే ఎలాంటి కోర్సులు లేవన్నారు. 'ఒక ఐఏఎస్ అధికారి ఇటీవల ఓ ఇంటర్వ్యూలో 'యానిమల్పై చేసిన వ్యాఖ్యాలు నాకింకా గుర్తున్నాయి. ఇలాంటి సినిమాలు అస్సలు తెరకెక్కించకూడదన్నది ఆయన అభిప్రాయం. ఈ సినిమా సమాజాన్ని పదేళ్లు వెనక్కి తీసుకువెళ్లిపోయిందన్నారు. ఆయన వ్యాఖ్యలు నిజంగా నన్నెంతో బాధించాయి. నేను ఏదో నేరం చేశాననిపించింది. ఆయన అనవసరంగా నా సినిమా గురించి తీవ్ర విమర్శలు చేస్తున్నారనిపించింది. కోపం వచ్చింది. ఆ సమయంలో నేను ఒక్కటే అర్థం చేసుకున్నా. ఐఏఎస్ అధికారి కావాలంటే.. ఢిల్లీ వెళ్లి ఏదైనా ఒక సంస్థలో చేరి కష్టపడి చదివితే చాలు. అదే ఫిల్మ్ మేకర్, లేదా రచయిత కావాలంటే ఎలాంటి కోర్సులు, టీచర్లు ఉండరు. నీకు నువ్వుగా అన్నీ నేర్చుకోవాలి. అభిరుచితోనే ముందుకు సాగాలి. ఇదే విషయాన్ని కావాలంటే నేను పేపర్పై కూడా రాసి ఇస్తాను" అని ఆయన పేర్కొన్నారు. అనంతరం సందీప్ ప్రభాస్తో తెరకెక్కిస్తోన్న 'స్పిరిట్' గురించి మాట్లాడారు. "మా సినిమా 'బాహుబలి'ని దాటాలంటే రూ.2000 కోట్ల కలెక్షన్స్ రాబట్టాలి. అది చాలా పెద్ద విషయం. ఇప్పటికైతే నేను మంచి సినిమా చేస్తాను. అది ఎంత కలెక్ట్ చేస్తుందనేది చూడాలి" అని చెప్పారు. '12త్ ఫెయిల్ యూపీఎస్సీ ప్రొఫెసర్గా నటించిన మాజీ ఐఏఎస్ అధికారి వికాస్ దివ్య కీర్తి ఆ సినిమా విడుదలైన సమయంలో ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. సమాజానికి ఇలాంటి సందేశాత్మక చిత్రాలు అవసరమన్నారు. అనంతరం ఆయన 'యానిమల్ను ఉద్దేశించి విమర్శలు చేశారు. ఈ తరహా చిత్రాలు అనవసరమైనవి అన్నట్లు మాట్లాడారు. వీటి వల్ల డబ్బు మాత్రమే సంపాదించగలమని చెప్పారు. సినిమాలు తెరకెక్కించినప్పుడు సామాజిక విలువలు పాటిస్తే బాగుంటుందని వ్యాఖ్యానించారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

## దేవుడన్నీ చూస్తుంటాడు.. అందుకే ఆమెకు పని లేకుండా పోయింది: నటిపై గాయకుడు ఫైర్

బాలీవుడ్ నటి బిపాసా బసు, ఆమె భర్త కరణ్ సింగ్ గ్రోవర్ ను ఉద్దేశించి గాయకుడు మికా సింగ్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. వారు తనకు అన్యాయం చేశారని వాపోయారు.




బాలీవుడ్ నటి బిపాసా బసు, ఆమె భర్త కరణ్ సింగ్ గ్రోవర్ను ఉద్దేశించి గాయకుడు మికా సింగ్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. వారి వల్ల తాను ఎంతో నష్టపోయానని అన్నారు. ఆ విషయంపై ఎన్నో సందర్భాల్లో బాధపడ్డానని చెప్పారు. వారు ఈరోజు ఏ పనీ లేకుండా ఇంట్లోనే కూర్చొన్నారంటే అందుకు కారణం కర్మఫలమేనని తెలిపారు. "బిపాసా బసు, కరణ్ గ్రోవర్ ప్రధాన పాత్రల్లో నటించిన 'డేంజరస్' వెబ్ సిరీస్కు నేను నిర్మాతగా వ్యవహరించా. అప్పటివరకూ మ్యూజిక్ రంగంలో మంచి పేరు తెచ్చుకున్న నాకు.. నిర్మాతగా మారాలనిపించింది. విక్రమ్ భట్ను సంప్రదించి ఒక కథ రాయించుకున్నా. దర్శకుడిగా భూషణ్ పటేల్ను ఎంపిక చేసుకున్నా. ఈ సిరీస్ను రూ.4 కోట్లలో చిత్రీకరించాలని బడ్జెట్ పెట్టుకున్నాం. బిపాసా దంపతుల వల్ల రూ.14 కోట్లకు పైగా ఖర్చు పెట్టాల్సి వచ్చింది. షూట్ కోసం లండన్ వెళ్లాం. అక్కడ వారిద్దరూ ఎన్నో నాటకాలాడారు. ఒక రోజు ఆమెకు ఒంట్లో బాగోదు. మరో రోజు ఆయనకు ఒంట్లో బాగోదు. అలా, షూట్ చాలారోజులు వాయిదా వేస్తూ వచ్చాం. నిజ జీవితంలో భార్యాభర్తలు కనుక.. సిరీస్ కోసం ముద్దు సన్నివేశాల్లో యాక్ట్ చేస్తారనుకున్నాం. కానీ, ఆమె అలా కాదు. నేను ఇది చేయను, అది చేయనంటూ కండిషన్స్ పెట్టేది. వాళ్ల ప్రవర్తన చూసి నిర్మాణ రంగంలోకి ఎందుకు వచ్చానా అని బాధపడ్డా. వీళ్లు మాత్రమే కాదు.. ఇండస్ట్రీలో ఉన్న చాలామంది నటీనటులు నిర్మాతలను ఇదేవిధంగా ఇబ్బంది పెడుతున్నారు. నిజం చెప్పాలంటే వాళ్లు నిర్మాతలను దేవుళ్లగా భావించాలి. కానీ అలా జరగడం లేదు. దేవుడు ఉన్నాడు. మనం చేసే పనులన్నీ చూస్తుంటాడని నేను నమ్ముతా. వాళ్లు నాడు నాకు చేసిన నష్టానికే ఈనాడు ఆ దంపతులకు ఏ పనీ లేకుండా పోయింది" అని ఆయన తీవ్ర విమర్శలు చేశారు. బిపాసా దంపతులను ఉద్దేశించి మికా సింగ్ ఈవిధమైన వ్యాఖ్యలు చేయడం ఇదేమీ తొలిసారి కాదు. గతంలో ఆయన వారి గురించి మాట్లాడుతూ తీవ్ర ఆరోపణలు చేశారు. వాళ్ల ప్రవర్తన చూశాక.. మళ్లీ నిర్మాతగా వ్యవహరించకూడదనుకున్నానని చెప్పారు.

## ఇంటి చిట్కాలు


### బంగారు నగలు ఎప్పటికీ కొత్తవాటిలానే ఉండాలంటే ఎలా క్లీన్ చేసి, స్టోర్ చేయాలంటే

బంగారం కొత్తగా మెరవాలని అందరికీ ఉంటుంది. అయితే, కొన్నప్పుడు కొత్తలో ఉన్నంత మెరుపు రాన్రాను ఉండదు. అలా కాకుండా ఎప్పటికీ బంగారు నగలు కొత్తగానే ఉండాలంటే ఎలా క్లీన్ చేయాలి, ఎలా స్టోర్ చేయాలో తెలుసుకోండి.

బంగారు నగలు వేసుకోవడం చాలా మందికి ఇష్టం. అయితే, వీటిని కొన్నప్పుడు ఎంత కొత్తగా మెరుస్తూ ఉన్నాయో అలానే ఉంచడం కాస్తా కష్టమే. వాడినప్పుడల్లా వాటి మెరుపు కాస్తా తగ్గుతుంది. జ్యువెలరీని వాడితేనే కాదు వాటిని స్టోర్ చేసి పెట్టినప్పటికీ ముందులా కొత్తగా ఉండవు. దీనికి చాలానే కారణాలు ఉంటాయి. అలా కాకుండా బంగారు నగలు ఎప్పటికీ కొత్తగా ఉండాలంటే కొన్ని టిప్స్ ఫాలో అవ్వాలి. ఇంట్లో దొరికే కొన్ని పదార్థాలతోనే వీటిని క్లీన్ చేసి స్టోర్ చేస్తే అవి తిరిగి కొత్తగా మారతాయి. మరి ఆ కిటుకులేంటో మీరూ తెలుసుకోండి.




#### నీటిలో నానబెట్టడం



నగల్ని నేరుగా క్లీన్ చేయడం కంటే ఓ సారి నీటిలో నానబెట్టి క్లీన్ చేయండి. దీనికోసం గోరువెచ్చని నీరు వాడండి. అలా అని మరీ వేడి నీరు వాడొద్దు. కేవలం గోరువెచ్చని నీటిలో నానబెట్టండి. దీంతో అందులో ఇరుక్కున్న జిడ్డు కరిగి నగలు తెల్లగా వస్తాయి. కాస్తా సమయం నీటిలో నానబెట్టాక ఆ తర్వాత వాటిని క్లీన్ చేయాలి.

#### నెమ్మదిగా రుద్దడం



చాలా మంది బంగారు నగల్ని టూత్పేస్ట్, టూత్ పౌడర్, సర్ఫ్, సబ్బు, లిక్విడ్ ఇలా రకరకాలవి వేసి క్లీన్ చేస్తారు. అయితే, అలా కాకుండా కాస్తా మైల్డ్ సోప్ సొల్యూషన్ అంటే ఎక్కువగా కెమికల్స్ లేని సోప్ని వేసి క్లీన్ చేయండి. అది కూడా మెత్తని టూత్ బ్రష్తో రుద్దండి. అంతేకానీ, బరబరా రుద్దొద్దు. దీంతో మెరుపు తగ్గడమే కాదు, గీతలు పడే అవకాశం ఉంది. కాబట్టి, నెమ్మదిగా మైల్డ్ సోప్తో నగల్ని క్లీన్ చేయండి.

#### క్లీన్ చేయడం



బ్రష్తో రుద్దాక ఒక్కో నగ తీసుకుని నల్లకింద పెట్టి వాటర్ ఆన్ చేయండి. అయితే జాగ్రత్త ఎక్కువ ఫోర్స్తో ఆన్ చేయకూడదని గుర్తుంచుకోండి. అదే విధంగా, ఒక్కొక్కటి మాత్రమే జాగ్రత్తగా తీసి వాటర్ కింద ఉంచండి. అంతేకానీ, మనం ఎక్కువగా నీటి కిందపెడితే నగలు జారి కిందపడే అవకాశం ఉంది.

#### ఆరనివ్వడం




అదే విధంగా, ఇలా క్లీన్ చేసిన నగల్ని జాగ్రత్తగా ఆరనివ్వండి. ఇందుకోసం మంచి సాఫ్ట్ అండ్ క్లీన్ క్లాత్ తీసుకుని అద్దాలి. గాలికి ఆరనివ్వండి. పూర్తిగా ఆరిన తర్వాతే స్టోర్ చేయండి. అంతేకానీ, తడిగా ఉన్నప్పుడు పెడితే నగల రంగు మారే అవకాశం ఉంది. కచ్చితంగా పూర్తిగా ఆరిన తర్వాతే భద్రంగా స్టోర్ చేయండి.

#### స్టోర్ చేయడం



వీటిని చక్కగా క్లీన్ చేశాక సెపరేట్గా ప్యాక్ చేసి స్టోర్ చేయాలి. ఒక్కొక్కటి విడివిడిగా ఉంచితే గీతలు పడవని గుర్తుంచుకోండి. అంతేకానీ, అన్నీ కలిపి స్టోర్ చేయొద్దు.
అదే విధంగా, గాలి చొరని బాక్స్లు వీలైతే ఆ గోల్డ్ కోసం వచ్చిన బాక్సుల్లోనే వాటిని ఉంచాలి.
అప్పుడే గోల్డ్ నగలు ఎప్పటికీ అప్పుడే కొన్నవాటిలా ఉంటాయి.
గోల్డ్, సిల్వర్ నగల్ని కూడా కలిపి ఉంచొద్దొని గుర్తుపెట్టుకోండి.
క్లీన్ చేయడం, స్టోర్ చేయడం రెండూ కూడా సెపరేట్గానే ఉండాలి.

#### వీటిని అసలే వాడొద్దు



అయితే, కొంతమంది ఎక్కువ మెరుపు రావాలని బ్లీచ్, అమోనియా, ఇతర హార్ష్ కెమికల్స్ వాడతారు. దీని వల్ల మెరుపు వచ్చినప్పటికీ అది శాశ్వతం కాదు. తర్వాత వాటి కళ తగ్గుతుంది. అదే విధంగా, వీటిని క్లీన్ చేసేందుకు స్క్రబ్బర్స్, వూల్ ప్యాడ్స్ వంటివి వాడొద్దు. అవి నగలకి చుట్టుకునే అవకాశం ఉమంది.